# ఏ మనసులో ఏముందో?

**సన్నటి** రోదన ధ్వని. ఆ బంగళా మేడ మీద ఎ. సి.రూమ్‌లో గాఢ నిద్రలో ఉన్న అవనీశ్‌ను జాగ్రదావస్థలోకి తెచ్చేంత తీవ్రత్వం ఉన్న దా ధ్వనికి. మెలకువలోకి వచ్చిన అవనీశ్‌కి ఆ సన్నటి మూలుగు ఎక్కడనుండి వస్తోందో తెలియటం లేదు. గదిలో బ్లూబెడ్‌లాంప్ వెలుగుతోంది. రేడియండయలు గడియారంపై టైము సుమారు రెండు గంటలు చూపుతోంది. విశాలమైన డబుల్ బెడ్‌పై తనపై కాళ్ళూ,చేతులూ పెనవేసి నిద్రపోతున్న భార్య నళినినుండి మెల్లగా విడివడి గది తలుపులు తీసుకుని బయటికి వచ్చాడు. ఉండి ఉండి ఆ రోదనం తిరిగి వినిపిస్తూంది. అంత రాత్రి వేళ ఎవరి దా గొంతు? చుట్టూ ఉండే బాధామయ ప్రపంచంలో ఎవరిదని గుర్తు పట్టటం?

ఒక కెమికల్ ప్లాంటు, ఎస్టేటు. బంగళా, కారు మొదలైన ఎన్నో రకాల ఆస్తులకు అధిపతి అయినా అవనీశ్‌కు అంతరాంతరాల్లో ఒక వైరాగ్యభావం, అందరిపట్లా సమభావం, ఆపదలో ఉండే ప్రాణిపై ఆర్ద్రతతో తపించే హృదయం ఉన్నాయి. ఆగర్భ శ్రీమంతుడుగా పుట్టి పెరిగిన అతనిల్లోని ఆ లక్షణాలు ఈ కాలానికి విపరీతంగా తోస్తాయి.

నెమ్మదిగా లైట్లు వేసుకుంటూ మేడ దిగి కింద తోటలోనికి వచ్చాడు.


"సలాం, సాబ్." ఎదురువడ్డాడు గూర్ఖా.

"ఎవ రా మూ లిగేది?"

అప్పటికే ఎదురుగా ఉండే కెన్నెల్ (కుక్కలను ఉంచే చిన్న ఇల్లులాంటి కొయ్య కట్టడం) లోంచి ధ్వని రావడం గ్రహించాడు అవనీశ్.

"బుల్ టెర్రియర్ టామీ, సాబ్. సాయంత్రంనుండి ఏమీ ఆహారం ముట్టడం లేదు. అమ్మగారూ, తమరూ క్లబ్బునుండి వచ్చాక చెబుదామంటే అర్ధరాత్రి దాటింది. ఇదేమంత ముఖ్య విషయం కాదు గదా అని..."

"కెన్నెల్ తలుపులు తియ్యి."



– భారతీదాసు

అవనీశ్ ముఖంలో భావాలు చదవగలిగే తెలివి లేదు గూర్ఖాకి. కుక్క పడుతూ లేస్తూ వచ్చి అవనీశ్ పాదాలను నాకుతూ మూలుగుతోంది. అతను వచ్చికపై కూర్చుని దాన్ని ప్రేమగా నిమరసాగాడు. కాని అతను చెయ్యి వేసినప్పుడల్లా విపరీతమైన బాధతో మెలికలు తిరిగి మొరిగింది కుక్క.

తెల్లవారగానే అప్పలస్వామి కోసం చూశాడు. ఆ నౌకరు అవనీశ్ చిన్నతనంనుండీ అక్కడే పనిచేసిన విశ్వాసపాత్రుడు. అవనీశ్ బహిఃప్రాణమైన ఆ కుక్క పెంపకం అప్పలస్వామి బాధ్యత. ఎంత సేపు చూసినా అప్పలస్వామి రాకపోయేసరికి ఇంకొక నౌకరు సాయంతో వెటర్నరీ డాక్టరు వద్దకు కారులో తీసుకు వెళ్ళాడు అవనీశ్. చాలా షేపు పరీక్ష చేసి సారాంశం చెప్పిన డాక్టరు వైపు ఆశ్చర్యంగా, అయోమయంగా చూస్తూ ఉండిపోయాడు.

"డాక్టర్!ఎంత డబ్బు ఖర్చయినా ఫరవాలేదు. దాని ప్రాణం కాపాడండి."

"ఖరీదైన ఇంజక్షన్ ఇచ్చాను. ఆహారంలో కలపాల్సిన మందులు ఇచ్చాను. తీసుకుపోయి జాగ్రత్తగా చూడండి. ఆరు గంటలు దాటితే గాని ఏమీ చెప్పలేను."

కంటికి రెప్పలా చూసుకున్నా హై ఫీవర్‌తో, అపస్మారక స్థితిలో అసురసంధ్యవేళ కన్ను మూసింది అవనీశ్ ఆరో ప్రాణమైన ఆ కుక్క టామీ.

ఆ రాత్రంతా మౌనంగా అనంతాకాశంలోకి చూస్తూ పోర్టికోలో గడిపేశాడు అవనీశ్. నళినికి అతని దుఃఖాన్ని పోగొట్టే ఉపాయం తోచలేదు. ఎన్నడూ అంత గంభీరమైన అతని మూర్తిని చూడని ఆమె అతని మనసుపై పడిన చెరగని ముద్ర విషాద ప్రభావం భవిష్యత్తులో దేనికి దారి తీస్తుందో ఊహించలేకపోయింది.

మర్నాడు ఉదయం రేగిన జుత్తుతో, ఎర్రబడిన కళ్ళతో, పది రోజులు లంఖణాలు చేసిన వాడిలా కుర్చీలో కూలబడి నిస్తేజంగా చూస్తున్న అవనీశ్‌కు ఎదురుగా వచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డాడు అప్పలస్వామి.

"బలంగా చావ మోదినందువల్ల ప్రాణాలు కోల్పోయింది టామీ అన్నారు డాక్టరు. ఎందుకలా చేశావు, అప్పలస్వామీ?"

అప్పలస్వామి కుప్పకూలిపోయి అవనీశ్ కాళ్ళమీద పడ్డాడు. రుద్ధమైన కంఠంతో గాద్గదికంగా గొంతు పెగిలించుకున్నాడు.

"అవనీశ్‌బాబూ! ఈ దుర్మార్గుణ్ణి బెల్టుతో కొట్టి చంపెయ్యండి. పోలీసులకి అప్పజెప్పండి. మీ ఉప్పు తిని పెంచిన ఈ శరీరాన్ని ఉప్పు పాతర్లో పడెయ్యండి. ఆ క్షణంలో తాగిన మైకంలో నా మతిమాలినతనానికి తగిన శిక్ష వెయ్యండి. బాబూ! నా కొడుకు లిద్దరూ రెక్కలు రాగానే ఎవరి దారి వాళ్ళు చూసుకున్నారు. మూడోవాడు ఎందుకూ పనికిరాని తిండిపోతు తిమ్మరాజు. తల చెడిన అప్ప, రోగాలతో తీసుకునే ముసలితల్లి. ఇది చాలనట్లు పెద్దకూతురు ముండమోసి ముగ్గురు పిల్లలతో నా కొంపకే చేరింది. చిన్న కూతురు వయసు రాగానే ఎవడితోనో లేచిపోయింది. రోగాలూ రొచ్చులూ, అవమానాలు, బాధ్యత లేని పిల్లలు, చాలని సంపాదన, నిత్యం వస్తులుండే పొట్టలు—తలుచుకున్నకొద్దీ టామీకి జరిగే భోగాలు చూస్తుంటే కుక్కగా పుట్టినా బాగుండును అనిపించేది. చక్కటి సబ్బుతో స్నానం, బిస్కట్లు, మాంసంముక్కలు, పాలు వగైరా ఆహారం... పొద్దున్న, సాయంత్రం షికార్లు. జంతువైనా దాని ఆలనా పాలనా కోసం ఒక నౌకరు. ఏమి దాని భోగం! ఆ ఊహ పెద్ద చెట్టులా పెరిగి టామీపై అసూయనూ, ద్వేషాన్నీ, కసినీ రగుల్కొలిపింది. ఆ నిప్పు రాజుకుని నన్ను దహించగా, ఆ మూగజీవిని మొన్న సాయంత్రం ఎవరూ లేనిచోట చెట్టుకు కట్టి నిర్దయగా చింతరువ్వతో..."

"ఫైర్ దట్ బాస్టర్డ్!" ఆగ్రహంతో ఊగిపోసాగింది నళిని. ఆమె అంతా విన్నదని అర్థం చేసుకున్నాడు అవనీశ్.

"పోయిన ప్రాణం ఎలాగా పోయింది. నీకు ఎక్కువ జీతం అవసరం కనక ఇస్తాలే, అప్పలస్వామీ."

అప్పలస్వామి చలించిపోయాడు. మారు మాట్లాడకుండా గేటు తీసుకుని బయటకు వెళ్ళిపోయాడు. *


తెలుగు సాహితీ పాఠకుల పంట!
టీనేజర్స్ (యువతీ యువకుల)
కలల పంట!
1973 సంవత్సరపు నవలగా పేరొందిన
హిమజ్వాల 1984 అద్వితీయ ముద్రణ!




1,2 భాగాలుగా
వెలువడుతోంది.
650 పేజీలు రూ.45/-
ప్రచురణకు ముందే
కొనుగోలు సౌకర్యంతో
రూ.40/- M.O. పంపి
రూ.4/- ఆడ్ చేయండి.
ఈ సౌలభ్యం డిశంబర్ 15
వరకు మాత్రమే!
పుస్తకాలు (1,2 భాగాలు)
మిగిలిన రూపాయికి
V.P.P లో పంపుతాము.

నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరురోడ్, విజయవాడ-2.
ఫోన్: 74005.

అందమైన భార్య
కావాలనుకుంటున్నారా?



ఈ రోజుల్లో అందమైన భార్య కావాలన్నా
భర్త లభించాలన్నా కేవలం అదృష్టమే.
అమ్మాయిలు, అబ్బాయిలు ముఖం మీద
మొటిమలతో, జిడ్డుగా వున్న
ముఖంతో నిరుత్సాహంగా, నల్లగా
కనపడతారు. అలాంటి వారందరికీ
వరం సురూప్‌లేప్
మొటిమలను పోగొట్టి మీ ముఖాన్ని
శుభ్రంగా కనుపింపచేస్తుంది. రంగు మార్పుతో
మీరు అందంగా కూడ కనపడతారు.




చలివలన కాలి మడమలు,
పాదములు, పెదవులు, చర్మంపై
వచ్చే పగుళ్ళు, చర్మమంతా
ఆరిపోవడాన్ని, చర్మం పొరలుగా,
పొట్టుగా రాలిపోవడం
మున్నగు వాటిని నయం
చేయడానికి అత్యంత ఉపయోగకారి
అమృతమలామ్

ఉత్పత్తిదార్లు:
అమృత్ ఫార్మస్యూటికల్స్
బెల్గాం-590002 (ఇండియా)